# ఓ గొడుగు కథ

– పులిగడ్డ విశ్వనాథరావు

ఇంటికి రాగానే సుశీల సోఫామీద కూలబడింది. కొత్త గొడుగుపోతే పోయింది. అది డబ్బు ఇచ్చి కొన్నది అయితేగా! పాత గొడుగు మాత్రం విరగడయింది కదా! అని.'ఆస్తి పోతే పోయింది, ఆక్టు అంతా తెలిసింది' అని వంకలు గుద్దుకున్న కక్షిదారులా ఆమె ఊరట చెందింది.

ఒకప్పుడు సుశీలకు ఆ పాత గొడుగు అంటే చాలా మోజుగా ఉండేది. మరి అది అప్పుడు పాతది కాదుగా! సీతాకోకచిలుక రెక్కల్లా గులాబీ రంగు నైలాస్ గుడ్డపై రంగు రంగుల పూలు, నీలిరంగు హాండిల్‌తో ముద్దు లొలుకుతూ చూడముచ్చటగా ఉండేది. సూర్యాస్తమవుతున్నప్పుడు ఆకాశంలో చుక్కలు పొడిచినట్లుండేది దాని సొగసు.

హాండిల్ మీది మీట నొక్కగానే నిలువు కర్ర రక్కుమని ముందుకు దూసుకుపోయి పొడవుగా మారి, గుడ్డ కలువ పువ్వులా విచ్చుకునేది. అది దిగుమతి సరుకు కూడాను.


కొత్త ఒక వింత పాత ఒక రోత. సుశీలకు ఆ గొడుగు అంటే ఇప్పుడు వొళ్ళు మంటగా ఉంటోంది. ఇప్పుడది ఆమెకు అడిగినప్పుడల్లా పుట్టింటి నుంచి కట్నం తీసుకు రాని కోడల్లా కనబడుతోంది. గొడుగు కూడా పాతపడిందేమో, దాని అందం, నవకం మందగించాయి. అది మేకప్‌లేని మాజీ హీరోయిన్‌లా వెలవెలబోతూ ఉంది.

"పోనీ కొత్త గొడుగు కొనుక్కుందామంటే పిడికుచ్చులాంటి ఈ పాత గొడుగు ఉందిగా. కొత్త గొడుగు కొనబుద్ధేయదు. ఈ ముష్టి గొడుగు ఎక్కడైనా పోయినా బాగుండును. అంచక్కా కొత్త గొడుగు కొనుక్కుందును" అని సుశీల వాపోయేది.

"ఔను, దీన్ని పోగొట్టుకోవడం ఏమంత అసంభవమా? దీన్ని ఎక్కడో మర్చిపోయినట్టు విడిచిపెట్టేస్తేనో! ఎక్కడో ఎందుకు, పచారీ కొట్టులో విడిచి పెట్టవచ్చు కదా" అని అనిపించింది సుశీలకు.

వెంటనే ఆమె ఆ ఉపాయాన్ని అమలు పెట్టింది. ఈసారి కిరాణా సామాన్ల కోసం కొట్టుకు వెళ్ళినప్పుడు టైము బాంబులా కౌంటరు కింద గొడుగును విడిచిపెట్టి చకచకా వచ్చేసింది.

"అమ్మా! ఇహ దాని ఋణం తీరిపోయినట్టే" అని నిట్టూర్చింది. ఔను పాపం. ఆ వర్ణఛత్రం తనకు ఆరేడేళ్ళపాటు సేవ చేసింది. హనుమంతుడి గదలా ఎప్పుడూ తోడు ఉండేది. కుక్కలని, రౌడీలని భయపెట్టించడానికి కూడా పనికివచ్చేది. ఎండలో తాను ఎండి, వానలో తాను తడిసి ఆమెను మాత్రం ఎండ వానల నుంచి కాపాడేది. అటువంటిది ఈ రోజుతో దూరమయిపోయింది" అని గొడుగును తల్చుకుంటూ ఇంటికి వచ్చేసింది.



ఇంతలోనే బెల్లు మ్రోగింది. ఎవరు చెప్మా అని తలుపు తీసింది. అయ్యబాబోయ్! చేతిలో గొడుగుతో కిరాణా కొట్టులో పనిచేసే నత్తి కుర్రాడు నిల్చుని ఉన్నాడు. "అమ్మాగారూ! మీరు మా అంగడిలో గొ...గొ...గొ...గొడుగు మరిచిపోయారు. మీరు గొ....గొ....గొ...గొడుగు బ్యాగులోంచి తీయడం మా యజమాని చూ...చూ...చూ...చూశాడట. ఈ గొడుగును మీకాడ ఎన్నో ఏళ్ళబట్టి చూస్తున్నాడట. అందువలన ఇది మీ...మీ...మీదేనని గుర్తుపట్టాడు!"

సుశీల ఏడవలేక, నవ్వలేక గొడుగు తీసుకుంది.

"ఔను, మర్చిపోయాను. చాలా థాంక్స్" అని అంది. మరి అనక తప్పలేదు.

"అమ్మగారూ! గొడుగును తెరిచినప్పుడు గట్టిగా పట్టుకోండి. ఇప్పుడు గా....గా.... గాలి కూడా బాగా వస్తూందేమో, పట్టు కాస్త వ...వ...వ... వదులుగా ఉంటే సరి ఆకాశంలోకి లేచిపోతోంది. మొన్న ఓ అమ్మగారి గొడుగు అలా ఎగిరిపోయి మరి దొరకలేదు"

"సరే" అంది సుశీల. కుర్రాడు వెళ్ళిపోయాడు.


'ఇది గొడుగా, పిశాచమా! దీన్ని వదిలించుకోవడం నేను అనుకున్నంత సులభం కాదే. ఏం చేయాలో పాలుపోవడం లేదు' అని అనుకుంది సుశీల.

ఉన్నట్టుండి సుశీలకు ఏదో స్ఫురించింది. "అయ్యో నా మతి మండ, ఆ కిరాణా కుర్రాడు అంత దివ్యమైన ఆలోచన చెప్పాడు. దాన్ని అమలు చేస్తే ఈ పింగళారి పీడ విరగడ అవుతుంది" అని అనుకుంది. వెంటనే ఇంటికి తాళంవేసి బైలుదేరింది.

బైట గాలి తీవ్రంగా ఉంది. గొడుగు చేతిలోంచి విడిపించుకుని ఆలా ఆలా నీలి మేఘాలలో తేలిపోవడానికి ఉబలాట పడుతోంది. రెండు, మూడు వీథులు దాటి ఇదే స్వర్ణావకాశం అనుకుని గొడుగు పిడిపై పట్టును సడలించింది సుశీల.

దాంతో అది పోలీసు చేతిలోంచి తప్పించుకున్న జేబు దొంగలా ఆలా వెనక్కు ఎగురుతూ, నేల తాకుతూ, మరల గాలిలోకి లేస్తూ కనుమరుగైంది. సుశీల వెనక్కు చూసి ఎవరూ చూడడం లేదని గమనించి సంతోషం పట్టలేక చిన్నపిల్లలా ఒక గంతువేసి చప్పట్లు చరిచి ముందుకు సాగిపోయింది.

ఇంతలో వెనుక నుంచి "అమ్మగారు! అమ్మగారూ!" అనే కేక వినిపించి వెనక్కి తిరిగి



చూడగా ఒక సైకిలతను గొడుగు తీసుకు రావడం కనబడింది. అతడు గొడుగును సుశీలకు అందిస్తూ "మీ గొడుగు ఆలా ఎగిరిపోవడం చూసి సైకిలు మీద వెంబడించాను. చాలా దూరం పోయిందనుకోండి. తీసుకోండి" అని పొంగిపోతూ అన్నాడు.

"చాలా చాలా ధన్యవాదాలు" అంది సుశీల గొడుగు అందుకుని. కాని అతడు నిలబడే వున్నాడు. ఏదో ప్రతిఫలం కావాలి కాబోలు. 'దేహశుద్ధిచేసి దీవించు అన్నట్టు దీన్ని తీసుకొచ్చి నా నెత్తిన పెట్టడమేకాక టిప్ కూడా కావాలా, నాతండ్రీ?' అని మనసులో అనుకుంది సుశీల. పర్సులో చూసింది. పది రూపాయల నోటుకంటే చిన్న నోటు లేదు. ఏమీ లేదు, పో అంటే బాగుండదు. చచ్చినట్టు పది రూపాయిల నోటు అందించింది.

అతడు నోటు అందుకుని జేబులో పెట్టుకుని "ఇదెందుకు అమ్మగారూ! అసలు నేను నిలబడి ఉన్నది మీరు బహుమానం ఇస్తారని కాదు, ఒక సందేహం తీర్చుకుందామని" అన్నాడు.

"ఏమిటి?" అని లేని నవ్వు తెచ్చుకుని అడిగింది.

"అమ్మగారూ! మీరు చూస్తే చాలా తెలివైన వారిలా ఉన్నారు. మరి గొడుగు ఎగిరిపోతూంటే తమరు గెంతి చప్పట్లు కొట్టి వెనక్కు ఎందుకు పోయారు?"

అమ్మ భడవా! ఇతడంతా చూశాడన్నమాట! "గొడుగు ఆలా ఎగిరిపోవడం చూసి సరదాగా అనిపించి చప్పట్లు చరిచాను. మరి అది నాకు దొరికే అవకాశం ఎలాగూ లేదని, ఈ గాలిలో ముందుకు పోవడం మంచిది కాదని చెప్పి వెనక్కు తిరిగి ఇంటిదారి పట్టాను" అని సర్ది చెప్పింది. అతడు అదోలా నవ్వి సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

ఈ గొడుగును ఎలాగో అలాగ వెంటనే విడిపించుకోవాలి. లేకపోతే ముమ్ముందు ఇంకా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వుంటుంది అని అనుకుని సుశీల ఆ రోజు వీధంట వెళ్తూండగా ఆమెకు బాంబు వంటి ఐడియా వచ్చింది. వెనుక, ముందు చూసింది. ఎవరూ లేరు. అదిగో ఒక బంగళా. బంగళా ముందు తోట. తోటలో కూడా ఎవరూ లేరు. ఇదే అదను అనుకుని తన గొడుగును మడిచి తోటలోకి గిరాటు వేసింది. ఇప్పుడు ఆ గొడుగును తనదీ అని ఎవరూ గుర్తు పట్టలేరు కదా. ఇహ గొడుగుకూ తనకూ గల సంబంధం పూర్తిగా తెగిపోయినట్టే!

మర్నాడు సుశీల ఆ వీధంటే వెళుతూంటే ఒక ముసలాయన కనబడి "అమ్మా, గులాబీ రంగు గుడ్డ, నీలిరంగు హేండిల్‌గల గొడుగు నీదే కదా? ఆ గొడుగు వేసుకుని నువ్వు ఈ వీధంట రావడం, పోవడం ఐదారేళ్ళబట్టి మా ఇంటిలోంచి రోజూ చూస్తున్నాను. నిన్న ఆ గొడుగు మా తోటలో పడుంది. మరి అది అక్కడికి ఎలా వచ్చిందో?" అన్నాడు.

ఒక్క గుటక మింగి "అలాగాండీ! అది నా గొడుగే. నిన్నే గాలి వలన అది నా చేతిలోంచి ఎగిరిపోయింది. వెతికాను కాని దొరకలేదు. అది మీ బంగళాలో పడినట్టుంది" అంది సుశీల.

"ఔను. అదే జరిగి వుంటుంది. గొడుగు తీసుకొస్తాను, ఉండమ్మా" అని బంగళాలోకి వెళ్ళి గొడుగు తీసుకొచ్చి అందించాడు ముసలాయన. 'నా తల రాత' అనుకుని ఇంటి మొహం పట్టింది సుశీల.

వారం రోజుల తర్వాత మాట. పొరుగింటి లత ఒక ముచ్చటైన గొడుగు తెచ్చి చూపెట్టింది సుశీలకు. "ఎంతిచ్చి కొన్నావు లతా!" అని అడిగింది సుశీల.

"ఆ కొనాలేదు, పాడూలేదు. నా పాత గొడుగు బస్సులో పోయిందిగా, బస్ సర్వీస్ వారి లాస్ట్ ప్రాపర్టీ (పోయిన సామాన్ల) శాఖకు వెళ్ళి నా గొడుగు గుర్తులు చెప్పి దాన్ని ఎవరైనా జమచేస్తే ఇప్పించమని దరఖాస్తు పెట్టుకున్నాను. అక్కడ దీన్ని తెచ్చి చూపించి ఇది నీదేనా అని అడిగారు. పోనీ ఏదో గొడుగు, నాది కాకపోతేనేం, అని చెప్పి నాదేనని తీసుకొచ్చేశాను."

ఈ సంఘటన తర్వాత సుశీలకు మంచి ఉపాయం స్ఫురించింది. మర్నాడే సుశీల బస్సు ఎక్కి కావాలని గొడుగును బస్సులో విడిచిపెట్టి ఇంటికి వచ్చేసింది. దేవుడు చల్లని చూపు చూసినట్టుంది. ఎవరూ తన గొడుగును తిరిగి తనకు అంటగట్టలేదు.

పాత గొడుగు ఎలాగూ విరగడయింది. దానికి బదులు ఉచితంగా మంచి గొడుగును కూడా సంపాదించవచ్చునని మర్నాడే సుశీల బస్ సర్వీస్ యొక్క లాస్ట్ ప్రాపర్టీ శాఖకు వెళ్ళి తన గొడుగు గుర్తులు పేర్కొంటూ ఆ గొడుగు కాని దొరికితే తనకు ఇప్పించమని దరఖాస్తు

పెట్టుకుంది.

ఒక ఉద్యోగి "ఈ గొడుగు మీదేనా?" అని ఒక గొడుగును తీసుకొచ్చి చూపాడు. ఆ గొడుగు తన గొడుగులాగే ఉంది కాని దానికంటె కొత్తగా వుంది. చాలా బాగుంది కూడా. "ఔను నాదే" అని దాన్ని అందుకోబోయింది. ఆ ఉద్యోగి దాన్ని తెరిచి "దీని మీద ఏదో పేరు ఎంబ్రాయిడరీ చేసి వుందే. మీ పేరు సుశీల కదూ" అని గొడుగు గుడ్డపై ఎంబ్రాయిడరీ చేసివున్న అక్షరాలను పరికించ సాగాడు.

"చచ్చానురా, దేవుడా" అనుకుంది సుశీల. ఆ ఉద్యోగి "చూడండి. ఈ పేరులో మూడు అక్షరాలు అనగా ఎస్.యు.ఎస్. అన్నవి స్పష్టంగా ఉన్నాయి. మీ పేరులో మొదటి మూడు అక్షరాలు అవే. అందువలన ఇది మీదేనని తేలింది" అన్నాడు. గొడుగును అందిస్తూ వెంటనే గొడుగును అందుకుని అందుకున్నట్టు సంతకం పెట్టి ఇంటిముఖం పట్టింది సుశీల.

సుశీల కొత్త గొడుగును అంతా మెచ్చుకున్నారు. ఒక వారం తర్వాత కిరాణా కొట్టుకు వెళ్ళింది. కొట్టు యజమానికి తనకు కావలసిన సామాన్లు రాయిస్తూండగా ఒక క్రిస్టియన్ మహిళ, "ఏమండోయ్, మీ గొడుగు చాలా బాగుంది సుమండీ" అంది. "థాంక్స్" అని చెప్పి చూడడానికని గొడుగు ఆమెకు అప్పచెప్పింది.

"నా పేరు సూసాన్. నా వద్ద కూడ అచ్చం ఇటువంటి గొడుగే ఉండేది లెండి" అని చెప్పి ఆ మహిళ గొడుగును తెరిచింది.

"అయ్యో! ఇది నా గొడుగేనండి. ఇదిగో దీని మీద నేను ఎంబ్రాయిడరీ చేసుకున్న నా పేరు. నా పేరులో మొదటి మూడు అక్షరాలు స్పష్టంగా ఉన్నాయి. దీన్ని బస్సులో మర్చిపోయాను" అంది ఆమె.

"ఐతే మీరే ఉంచుకోండి" అని చెప్పేసి సుశీల గబగబా ఆమె థాంక్స్ చెప్తున్నా వినిపించుకోకుండా ఇంటిదారి పట్టింది.

ఇంటికొచ్చి సోఫామీద కూలబడి, కొత్త గొడుగు పోతే పోయింది. అది డబ్బు ఇచ్చి కొన్నది అయితేగా! పాత గొడుగు మాత్రం విరగడయింది కదా! అని అనుకుంటూండగా కాలింగ్ బెల్ మోగింది. తలుపు తెరిచింది. ఎదురుగా సూసాన్ నిలబడి వుంది. ఆమెను లోనికి ఆహ్వానించింది.

"మీ పేరు సుశీల అని చెప్పి మీ అడ్రస్ ఇచ్చాడు కిరాణా కొట్టాయన. నా గొడుగు తిరిగి ఇచ్చినందుకు థాంక్స్. మీరు నాకు ఇంత ఉపకారం చేశారు కాబట్టి నేనూ మీకు కొద్దో గొప్పో ఉపకారం చేయాలిగా" అంది సూసాన్.

"దానికేముంది లెండి, సూసాన్‌గారూ! నా పోయిన గొడుగుకు బదులు బస్ సర్వీస్ లాస్ట్ ప్రాపర్టీ డిపార్ట్‌మెంట్‌వారు ఒక గొడుగు ఇస్తే తీసుకొచ్చాను. అది మీది కాబట్టి మీకు ఇచ్చేశాను అంతేగా"

"సుశీలగారూ, నా గొడుగు పోయాక నేను కూడా లాస్ట్ ప్రాపర్టీ డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళాను. వాళ్ళు నా గొడుగులాంటిదే ఓ పాత గొడుగు ఇచ్చారు. ఎందుకైనా మంచిదని తీసుకున్నాను"

"మంచి పనే చేశారు"

"ఇవాళ మీరు నా గొడుగు నాకిచ్చారుగా. ఆ గొడుగు, పాత గొడుగు రెండూ తీసుకెళ్ళడం కష్టమని పాత గొడుగును కిరాణా కొట్టాయనకిచ్చి, సామాన్లతో బాటు ఇంటికి పంపమన్నా. అతడు పాత గొడుగును చూసి టక్కున మీదేనని గుర్తుపట్టాడు. అందువలన ఆ గొడుగు మీకిచ్చేసి థాంక్స్ కూడా చెప్పి పోదామని వచ్చాను" అంది సూసాన్.

"చాలా థాంక్స్ సూసాన్‌గారూ" అంది సుశీల లేని చిరునవ్వు తెప్పించుకుని. మనసులో మాత్రం సూర్యగోళంలా ఉంది ఆమెకు. తర్వాత తమాయించుకుని "ఎంత కాకతాళీయమో చూడండి. పోనీ ఈ గొడుగుల మూలంగా మీ పరిచయం అయిందిగా. ఏం తీసుకుంటారు?" అన్నది.



## యువ కవయిత్రి!

సశీతా జేమ్స్ ఛార్లెస్. కాన్వెంట్లో చదువుతున్న ఆ బాలిక బహుముఖ ప్రజ్ఞావంతురాలు. చదువులో, నృత్యంలో, చిత్రకళలో ఆమెకు అభినివేశం ఉంది! ఇవేకాక సశీతా కవయిత్రి కూడా! చక్కటి కవితలను ఎన్నింటినో తరుచుగా వ్రాస్తూ ఉంటుంది. కాలేజీకి ఆమె ప్రవేశించేసరికి కవితావేశం మరింత ప్రజ్వరిల్లి అత్యుత్తమ కవితలను వ్రాయసాగింది. 1989వ సం. లో ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ పొయట్స్ సంస్థవారు సశీతా, స్నేహాన్ని గురించి వ్రాసిన ఓ అద్భుతమైన కవితకు అభినందనలు పంపారు! ఈమధ్య ఆమె చీకటిపై ఓ కవితను వ్రాసి ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ పొయట్స్ సంస్థకు పంపింది. వారామెకు మెరిట్ అవార్డును ఇచ్చారు! సశీతాకు త్రీఛీర్స్ చెప్దాం!

—కొడిమెల శ్రీరామమూర్తి

